ప్రజాశక్తి
మంగళవారం 7 మార్చి 2023
5
శ్రీకాకుళం



స్పీకర్ సీతారాం స్థలంలో కొబ్బరి మొక్కలకు నీళ్లు పెడుతున్న మున్సిపల్ శానిటరీ మేస్త్రి శ్రీనివాసరావు

ఖరీఫ్‌కు వంశ'ధార' పారేనా..?

- జూన్‌తో ముగియనున్న గడువు
- రిజర్వాయర్ పనులు 93 శాతమే పూర్తి
- 87, 88 ప్యాకేజీ పనులదీ అదే పరిస్థితి
- సకాలంలో పూర్తి కావడంపై నెలకొన్న సందేహాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి కావడంపై సందేహాలు నెలకొన్నాయి. గతేడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు ఒప్పంద కాలపరిమితిని పొడిగించారు. సకాలంలో పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది జూన్ వరకు పొడిగించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పరిస్థితి పరిశీలిస్తే అప్పటికీ పూర్తయ్యేలా కనిపించడం లేదు. లైనింగ్, ఇతర నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా చర్చ నడుస్తోంది. ఆ సమయానికి దాదాపు పూర్తవుతుందని, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నాటికి నీరు విడిచిపెడతామని చెప్తున్నారు. అది ఎంతవరకు నెరవేరుతుందనేది చూడాల్సి ఉంది.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమారు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.2,671.52 కోట్లకు పెంచారు. మూడున్నరేళ్ల కాలంలో నిర్మాణ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 86 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.173.63 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.124.87 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 7.63 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 3.83 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్‌పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 25 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 24 నిర్మించారు. ఒప్పంద కాలపరిమితిని ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.192.66 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.156.83 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 16.6 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 1.19 కి.మీ మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 37 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 36 నిర్మించారు. ప్యాకేజీ పనులు అక్టోబర్ 28, 2017 నాటికి పూర్తి కావాల్సి ఉంది. పలు కారణాలతో పనులు సకాలంలో కాకపోవడంతో, ఆరు నెలలకోసారి పొడిగించారు. చివరిసారిగా ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

జూన్ నాటికి పనులు పూర్తి చేస్తాం

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 పనులు ఈ సంవత్సరం జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ సమయానికి 98 నుంచి 99 శాతం పనులు పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నాం. చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండవచ్చు. ఆగస్టు, సెప్టెంబరులో నీళ్లు విడిచిపెట్టే అవకాశం ఉంది.

- డోల తిరుమలరావు, వంశధార ఎస్ఇ

మందకొడిగా సాగుతున్న పనులు

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులకు రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రాజెక్టు పనులను 87, 88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయర్ పనులుగా విభజించారు. 87 ప్యాకేజీ పనులను హర్విన్ కన్‌స్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు, 88 ప్యాకేజీ పనులను శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు, హిరమండలం రిజర్వాయర్ పనులను సోమ-పటేల్ కంపెనీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 2008 జులై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 93 శాతం పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.1650.20 కోట్లను ఖర్చు చేశారు.

రిజర్వాయర్ పనుల్లో కనిపించని పురోగతి

హిరమండలం రిజర్వాయర్ పనుల అంచనా వ్యయం రూ.419.03 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.376.31 కోట్లను వెచ్చించారు. ఇప్పటివరకు 91 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మూడున్నర ఏళ్లలో పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వంశధార ప్రాజెక్టు పూర్తికి అనేక పర్యాయాలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా, ఏనాడు అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం అక్టోబరు 28, 2017 నాటికి పూర్తి కావాలి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో, అప్పట్నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. చివరిసారిగా జూన్ 30 వరకు మరోసారి పొడిగించారు.

మున్సిపల్ సిబ్బంది స్వామిభక్తి

ఆమదాలవలస మున్సిపాల్టీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. జనాభాకు తగ్గట్లుగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై అదనపు పనిభారం పడుతోంది. మరోవైపు అపారిశుధ్య పరిస్థితులతో ప్రజలకూ ఇక్కట్లు తప్పడం లేదు. ఇటువంటి సమయంలో మున్సిపల్ అధికారులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంపై స్వామిభక్తిని ప్రదర్శిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది ఉద్యోగ విధులను పక్కనపెట్టించి, పారిశుధ్యాన్ని అటకెక్కించి మరీ వ్యక్తిగత సేవలకు కేటాయిస్తున్నారు.

- స్పీకర్ సీతారాం సొంత స్థలంలో పారిశుధ్య ఉద్యోగుల పనులు
- ఉద్యోగ విధులు వదిలి వ్యక్తిగత సేవలకు కేటాయింపు
- సిబ్బంది కొరతతో ఉన్న వారిపై అదనపు భారం
- పారిశుధ్య పనులపై ప్రభావం

ప్రజాశక్తి - ఆమదాలవలస

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సేవలో మున్సిపల్ అధికారులు తరిస్తున్నారు. వారి స్వామిభక్తి కిందిస్థాయి సిబ్బందిని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పురపాలక సంఘంలో ఒకటో వార్డు పరిధిలోని స్పీకర్ తమ్మినేని సీతారాం స్థలంలో గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించడానికి మున్సిపల్ రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తుండడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పారిశుధ్య విభాగానికి చెందిన ఒక రెగ్యులర్, ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆ స్థలంలో కొబ్బరి చెట్లకు నీరు పోస్తూ, గడ్డి తీస్తూ పనులు చేస్తున్నారు. సోమవారం ఉదయం అటువైపుగా వెళ్లే ప్రజలు ఈ దృశ్యాన్ని చూసి అవాక్కయ్యారు. మున్సిపాల్టీలో 95 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా, 72 మందే ఉన్నారు. దీంతో పనిభారం పెరిగి శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది కొరతతో కొన్ని వార్డుల్లో చెత్తను రెండు రోజులకోసారి శుభ్రం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పట్టణ పారిశుధ్యాన్ని చక్కదిద్దాల్సింది పోయి పారిశుధ్య సిబ్బందిని నాయకుల వ్యక్తిగత పనులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నించారు. మరోవైపు పలు విభాగాలకు చెందిన మున్సిపల్ సిబ్బంది పది నుంచి 15 మంది వరకు రోజూ నాయకుల వ్యక్తిగత పనులకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వారి విభాగంలో వారు చేయాల్సిన పనిని పక్కనపెట్టించి మరీ వ్యక్తిగత పనులకు ఉపయోగిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆ ప్రచారానికి సోమవారం పారిశుధ్య సిబ్బంది చేసిన పనులు వెలుగు చూడడం మరింత బలం చేకూర్చినట్లయింది. అధికారులు స్వామిభక్తిని ప్రదర్శించి, ప్రజలకు అందించాల్సిన సేవలపై శీతకన్ను వేయడం సరికాదని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడును వివరణ కోరగా, విధులను నిర్వర్తించాల్సిన సమయంలో అక్కడ విధులు నిర్వహించడం తన దృష్టికి రాలేదని చెప్పారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మహిళా దినోత్సవ ర్యాలీ

శ్రీకాకుళం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, ఇతర శాఖలు సంయుక్తంగా ఈనెల 7వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. అనంతరం బాపూజీ కళామందిరంలో ఉదయం పది గంటలకు మహిళా దినోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మహిళలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రమాప్రభను గెలిపించండి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి(పిడిఎఫ్) డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు రమేష్ పట్నాయక్, కోనారి మోహనరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజును కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రధాన పోటీదారుల్లో ఇద్దరు ఎప్పుడూ ప్రజా సమస్యలపై స్పందించని నేతలు ఇప్పుడు ఒక్కసారిగా వాటిపై మాట్లాడటం శోచనీయమన్నారు. వీరు సామాజిక రాజకీయ అంశాలపై, ఉత్తరాంధ్ర వెనుకబాటుపై, వలసల గురించి, యువతకు ఉపాధి కల్పన, ఉత్తరాంధ్రకు రావాల్సిన ప్యాకేజీ గురించి, స్టీల్ ప్లాంట్, రైల్వేజోన్, సుజల స్రవంతి, తదితర సమస్యలపై స్పందించిన దాఖలాల్లేవన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల పక్షాన నపోరాడిన సందర్భం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదన్నారు. 250 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఐక్యంగా బలపర్చిన రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, గెలిపించాలని కోరారు.

దాసరి రాజును మద్దతు కోరుతున్న ప్రజాసంఘాల నాయకులు

పలుచోట్ల విస్తృత ప్రచారం

పొందూరు: డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కూన వెంకటరావు కోరారు. రమాప్రభను గెలిపించాలని కోరుతూ తుంగపేట, రాపాక గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపు ఉత్తరాంధ్ర సమగ్ర అభివద్ధి కోసం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగులకు ఒక ఆసరా, చేసే ఉద్యమాలకు మద్దతుగా ఉంటుందని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రశ్నించే గొంతుకలుగా ఉంటూ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా గళమెత్తుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిరసనలకు అవకాశం ఇవ్వడం లేదని, పోలీసు నిర్బంధం ద్వారా ప్రజా ఉద్యమాలను అణిచివేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. సీరియల్ నెంబరు 11లో రమాప్రభ ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు 1 వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బిపి ధనుంజయరావు, ముల్లు హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : రాపాకలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

నందిగాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రాజసంఘాల ఆధ్వర్యాన మండలంలోని నందిగాం, తురకలకోట, పెద్ద బాణాపురం, కవిటి అగ్రహారం, సవర లింగుపురం, దిమ్మిడిజోల కెజిబివి, మధనాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల, నౌగాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం ప్రచారం చేశారు. రమాప్రభకు మొదటి ప్రాదాన్యత ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.షణ్ముఖరావు, పాలిన సాంబమూర్తి పాల్గొన్నారు.

పలాస: ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు చాపర వేణుగోపాల్, ఎన్.గణపతి కోరారు. సోమవారం పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావించి, పరిష్కరించడంలో రమాప్రభ ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ రవి, వై.మురళి, మణికంఠ పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి

సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళలకు సంపూర్ణమైన సమాన హక్కులు కల్పించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతపై మాటలకే పరిమితం తప్ప ఆచరణలో చేసిందేమీ లేదని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు నేటికీ అమలు కాకపోవడమే మహిళలపై ఉన్న వివక్షకు నిదర్శనమన్నారు. అత్యాచారాలు, హింస, వేధింపులు, వరకట్న మరణాలు ప్రతిరోజూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ సమాజంలో మహిళ వ్యాపార వస్తువుగా మార్చి వ్యాపార ప్రకటనలకు అంగడి వస్తువుగా చూపిస్తున్న పరిస్థితి ఉందన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో పూర్తి వివక్ష చూపిస్తున్నారని చెప్పారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, హత్యలు మానభంగాలు జరుగుతున్నా సరైన భద్రత లేదన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్నా సమాన హక్కులు కల్పించకపోగా, వివక్ష చూపుతున్న పరిస్థితి ఉందన్నారు. నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత మహిళల పరిస్థితి మరీ హీనంగా దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ పథకాల్లో కోటి మంది మహిళా కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా వేతనాలు, ఉద్యోగ భద్రత ఇతర సౌకర్యాలు కల్పించకుండా తీవ్రంగా శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. మార్చి 8న నిర్వహించుకునే అంతర్జాతీయ దినోత్సవం అనేక మహిళా పోరాటాల నుంచి పుట్టుకొచ్చిందని తెలిపారు. 1910లో మహిళా సమస్యలపై ప్రత్యేకమైన చర్చ ఉండాలని ప్రపంచవ్యాప్తంగా మహిళల పోరాట ఫలితంగా 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందని వివరించారు. రాష్ట్రంలోనూ మహిళలు అనేక ఉద్యమాలు నడిపిన చరిత్ర ఉందన్నారు. సారా వ్యతిరేక, అక్షరాస్యత, లింగ వివక్ష, ఆస్తి హక్కు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన దీక్షా దినంగా పాటిస్తూ ఐద్వా, సిఐటియు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, యుటిఎఫ్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు బి.ధనలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలు నగరంలోని ఎన్‌జిఒ హోంలో సోమవారం ప్రారంభమయ్యాయి. సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. తొలిరోజు లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ తదితర క్రీడలను నిర్వహించగా, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు ధీటుగా రాణిస్తున్నారని చెప్పారు. ఏటా మహిళా దినోత్సవాన్ని తమ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తోందని, ఆ క్రమంలోనే ఈ ఏడాదీ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండో రోజు మంగళవారం పాటల పోటీలు, డాన్స్, రంగోళి, వంటల ప్రదర్శన, మెమరీ గేమ్, ఉమెన్స్ డే డిబేట్ నిర్వహించనున్నట్లు వివరించారు. మహిళా దినోత్సవ వేడుకల్లో ఉద్యోగినులు పాల్గొనే విధంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఈనెల 7, 8వ తేదీల్లో రెండో అనుమతి ఇచ్చారని తెలిపారు. 8వ తేదీన సాయంత్రం మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, నాయకులు బడగల పూర్ణచంద్రరావు, రాజకుమార్, డేవిడ్, బొత్స శ్రీనివాసరావు, మహిళా విభాగం నాయకులు కె.రోజాకుమారి, మమతా బెహరా, పి.శ్రావణి, జి.లలిత, హైమావతి, సబీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పీడీకి లేఖను అందజేస్తున్న నాయకులు

నేషనల్ హైవే పీడీతో చర్చలు

శ్రీకాకుళం అర్బన్: రోడ్డున పడిన చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులకు మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో ఉపాధి కల్పించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు నేషనల్ హైవే పీడీ పి.శివశంకర్‌ను కోరారు. నగరంలోని ప్రజాసదన్‌లో ఎంపీ సమక్షంలో నేషనల్ హైవే అధికారులు, యూనియన్ నాయకుల మధ్య సోమవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజాలో 2007 నుంచి పనిచేస్తున్న కార్మికులను టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని కోరారు. ఈనెల 13వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం నేషనల్ హైవే చైర్మన్‌కు కేరళ ఎంపీ కరీం రాసిన లేఖను యూనియన్ నాయకులు అందజేశారు. సమావేశంలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డి.వి నర్సింహులు, ఎ.వి.ఆర్ మూర్తి, శంకరనారాయణ, వెంకటరమణ, జగదీష్ పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం:: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జల్లు లక్ష్మణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు అర్హులని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన వారై ఉండాలని తెలిపారు. బిసి, ఇబిసి విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2010 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదని స్పష్టం చేశారు.

THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE TEKKALI
I.P. NO.04/2022

Between: **Yandamuri Krishnam Raju**
-- Petitoner
and: **Peddina Karrenna and & 8 Others**
--Respondents

4th Respondent:
R4. Gurrala sahadev, Aged about 45 year S/o late Rammlu R/at Charandas Puram Village, Kota bommali Post & Mandal, Srikakulam Dist.

where as the petitioner filed above IP (insolvency petition) and the matter is posted to **15/03/2023** for your appearance you have to appear at **10.30 AM** on **15/03/2023** before the seed Hon'ble court and file your Objections. If you fail to appear be for the said court the matter will be Proceeded exparte in your absence.

VELAMALA APPALA NAIDU
Advocate,
Kotabommali,
Srikakulam District
9949313836

మహారాజశ్రీ శ్రీకాకుళం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
0S. 552/2011

Between: కోయ్యాన యండమ్మ
--వగైరాలు/వాదులు
And: కోయ్యాన రామారావు
--వగైరాలు/ప్రతివాదులు

To,
D4. గంగు సుశీల **W/o** లేటు జోగారావు, వయస్సు 48, హిందు, గృహిణి, సోమరాజు పురం గ్రామం ఆకులతంపర పోస్టు, కొత్తూరు మండలం శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు దావాల్లో ప్రతి వాది వలన వాదికి రావలిసిన దావా షెడ్యూలు ఆస్తిలో వాటా నిమిత్తము పై కోర్టులో దావా దాఖలు చేయడమైనది. సదరు దావాలో మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకో నెందుకు గాను తే **10-03-2023** దీన వాయిదా పడి వున్నది. పై తేది నాడు పగలు ఉ॥ గం॥ **10-30** ని॥ లకు స్వయంగా గాని వకీలు ద్వారాగాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపర్చుకోనవలేను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(వాయిదా తేది 10.03.2023 కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

భైరి జగదీశ్వరరావు
అడ్వకేట్, శ్రీకాకుళం

మా భూములకు పట్టాలు ఇవ్వరూ..

కలెక్టర్‌కు కిడిసింగి గ్రామస్తుల వినతి

'స్పందన'కు 204 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు, కిడిసింగి మత్స్యకార గ్రామాల్లో ఐదు దశాబ్దాలుగా సాగు చేస్తున్న జీడితోటలు, సరుగుడు తోటలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన పుక్కళ్ల అప్పన్న, జగమయ్య, వడ్డి భాను, శాంతమ్మ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. సోమవారం నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో స్పందన నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గత ఏడాది ఫిబ్రవరిలో ఎఫ్ఎన్ఒలుగా పిహెచ్‌సిల్లో నియమితులైన 69 మందికి అప్పటి నుంచి ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని, తక్షణమే వేతనాలు ఇప్పించాలని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలోని అనేక గ్రామాల్లో పండించిన ధాన్యం కళ్లాల్లోనే ఉన్నాయని రైతులు అర్జీ సమర్పించారు. పిడి మందస గ్రామ సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. ఈ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులపై గతంలో ఫిర్యాదులు వచ్చినా ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని కలెక్టరు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తక్షణమే గతంలో వచ్చిన ఫిర్యాదును పరిష్కరించి, సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు., జిల్లా వ్యాప్తంగా 204 ఫిర్యాదులను స్వీకరించారు. మూడు నెలల వ్యవధిలో 2567 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించినట్టు చెపుతున్నా 597 మంది స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేశారని, ప్రజలు సంతృప్తి చెందని స్థితి కల్పిస్తున్న అధికారులే అందుకు బాధ్యులన్నారు.

ముఖ హాజరు తప్పని సరి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు శతశాతం ముఖ హాజరు అవసరమని కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 మంది ఉద్యోగుల ముఖ హాజరు నమోదు కావడం లేదని, గృహ నిర్మాణశాఖలో 35మంది ముఖ హాజరు నమోదు కావడం లేదని, అలా నమోదు కాని ఉద్యోగులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పీడీనిప్రశ్నించారు.

కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిఆర్‌ఒ రాజేశ్వరి, డెప్యూటీ కలెక్టరు జయదేవి, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, డిపిఒ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌వి ఈశ్వరప్రసాద్ , డిఎంహెచ్ఒ మీనాక్షి, డిఇఒ పగడాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలు నిర్వీర్యం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి రామకృష్ణ

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని స్థానిక సంస్థల హక్కులు, నిధులు, విధులు లేకుండా అలంకారప్రాయంగా స్థానిక సభ్యులు మారారని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి అనెపు రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పలాసలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల సమస్యలను చట్టసభలో ప్రశ్నించే గొంతుగా వ్యవహరిస్తానని, తనను స్థానిక సంస్థల ప్రతినిధులు ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని కులాల వారిధిగా చట్టసభలో తన గొంతు వినిపిస్తానని తెలిపారు. రాష్ట్ర తూర్పుకాపు సంఘం అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జిల్లా అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసరావు

మాట్లాడుతున్న రామకృష్ణ

మాట్లాడుతూ జిల్లాలో తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఎదురు చూసినా నిరాశ మిగిలిందని అన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో అత్యధికంగల తూర్పు కాపులు అణచివేత, వివక్షతకు గురవుతున్నారని చెప్పారు. అనెపు రామకృష్ణను స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. సమావేశంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, రౌతు చిరంజీవి, తాడేల సందీష్, పైల రామ్మూర్తి, మజ్జి భాస్కరరావు, దేవాడ శ్రీనివాసరావు, వెంకునాయుడు, ఆదినారాయణ, శ్రీనుబాబు, రాగోలు కృష్ణారావు, బెల్లాన రామారావులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచస్థాయి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుతం క్రీడాకారులంతా ముందుకు సాగాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ అన్నారు. ఇటీవల ఇచ్ఛాపురంలో నిర్వహించిన అంతర్జాతీయ కంగ్ఫ్యూ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మాస్టర్ సాయిబాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులకు నగరంలోని అబ్దుల్‌కలాం పార్క్‌లో సోమవారం అభినందించారు.

దశాబ్ద కాలంగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.చంద్రరావు, కోచ్ గాయత్రి, ఎం.విజయకుమార్, ఆర్.దయామయ, శ్రీనివాస్, జానిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అంతర్రాష్ట్ర పోటీల్లో బంగారు పతకాలు సాధించిన డి.కిరణ్,

విద్యార్థులను అభినందిస్తున్న మోహన్, తదితరులు

డి.హర్షవర్థన్, జి.నవీన్, కె.హరి, సిల్వర్ మెడల్ సాధించిన డి.జగదీష్, రామకిషన్‌దేవ్, డి.గౌతమ్, ఎ.రేవంత్, ఎ.సందీప్, బ్రాంజ్ మెడల్ సాధించిన గౌతమి, ఉజ్వల్‌కు ధ్రువపత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చౌదరి సతీష్, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, హనుమంతు జ్యోతికిరణ్, ఎసిటిఐ కామరాజు, సీనియర్ క్రీడాకారులు రవి, హరీష్, వెంకి, రాము పాల్గొన్నారు.

కోర్టు నుంచి బయటకు వస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఫ్యాప్టో నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబరు 1న ఎన్‌జిఒ హోమ్ నుంచి కలెక్టరేట్ వరకూ ఫ్యాప్టో ఆధ్వర్యాన మహా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా సభ నిర్వహించారు. ఈ సభ చట్ట విరుద్ధమని, చట్టపరమైన అనుమతులు లేవంటూ జిల్లా ఫ్యాప్టో నాయకులపై పోలీసులు కేసులు పెట్టారు. ఈ కేసులు పూర్తి నిరాధారమని జిల్లా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం కేసును కొట్టివేసింది. ఈ కేసును సీనియర్ న్యాయవాది బగాది రామ్మోహనరావు వాదించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు పేడాడ ప్రభాకరరావు (ఎస్‌టియు), చౌదరి రవీంద్ర (యుటిఎఫ్), టెంక చలపతిరావు (ఎపిటిఎఫ్-1938), పేడాడ దాలినాయుడు (ఎపి హెచ్‌ఎంఎ), కరిమి రాజేశ్వరరావు (ఎపి సిపిఎస్ ఇఎ), గురుగుపల్లి భాస్కరరావు (ఎపి సిపిఎస్ యుఎస్)లతో పాటు ఇతర నాయకులను నిర్దోషులుగా తీర్పు వెలువడింది.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళల భద్రతే మా బాధ్యత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళల భద్రతే పోలీసుల బాధ్యత అని పోలీస్ కానిస్టేబుల్ బి.సంతోషకుమారి అన్నారు. మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు రూపొందించిన స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. పోలీస్ యంత్రాంగం పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో కళారూపాన్ని ప్రదర్శిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు ఎం.రమణకుమార్, కె.రామరాజు, స్రవంతి, హరిప్రసాద్‌రాజు, వెంకటరమణ, పద్మావతి, వసంతకుమారి, వాసుదేవరావు పాల్గొన్నారు.

రేషన్ కోసం మహిళల ధర్నా

ప్రజాశక్తి- టెక్కలి

ఫిబ్రవరి నెల రేషన్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన మహిళలు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రేషన్ కార్డులు పట్టుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వేములవాడ విశ్వనాథపురం గ్రామానికి చెందిన 2వేల ధాన్యం బస్తాలు కొనుగోలు చేయాలని రైతులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో ఈ-క్రాప్ నమోదులో అవకతవకలు చోటు చేసుకున్నాయని రైతులు వినతిపత్రం అందించారు. మొత్తం 32 సమస్యలపై వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధిచేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నసాన, కొత్తపేట సచివాలయం పరిధిలోని సర్పంచ్, ఎంపిటిసి, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలు కులం, మతం చూడకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సిఎం మంజూరు చేస్తున్నారని అన్నారు. అన్నీ పార్టీల వారికీ పథకాల ద్వారా లబ్ధిచేకూరుతుందని వివరించారు. టిడిపి ఎన్ని

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైసిపి అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందరం కలిసి పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, గడ్డవలస నాగభూషణరావు, దుక్క రోజారామకృష్ణ, నూక సత్యరాజు, బి.అప్పన్న, బి.ఎల్లయ్య, బి.సూర్యారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్, రామారావు

సైబర్ మోసాలకు గురికావద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని వంజంగిపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో కళాజాతాలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. అలాగే ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరితే అతి తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యంలో అధిక ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్స్యూరెన్స్ పథకాలను గురించి విపులంగా ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరు, అలాగే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని చెప్పారు. ఎటిఎం కార్డుల వెనుక పిన్ నంబరును రాయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, వాలంటీర్ రాజేష్, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు

కంచిలి : మండలంలోని పెద్ద శ్రీరాంపురం విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద సోమవారం పాడి రైతులకు సంస్థ ప్రతినిధులు వడ్డీ లేని రుణాలను అందజేశారు. గ్రూప్ లీడర్, ఎంపిటిసి మాదిన విమల రూ.50వేలు చొప్పున 18 మంది రైతులకు రూ.9 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లు

సోంపేట: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వైసిపి అభ్యర్థుల తరపున గ్రామ వాలంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారం నిర్వహిస్తున్నారని టిడిపి మండల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సోంపేటలో సూరాడ చంద్రమోహన్, రేల్ల శ్రీను మాట్లాడారు. ఎన్నికల కమిషన్, కోర్టులు స్పష్టంగా ఎన్నికల ప్రచారాల్లో వాలంటీర్లు పాల్గొన కూడదని చెప్పినా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థి తరపున పాఠశాలలకు ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా బోల్తా పడిన లారీ

లారీ బోల్తా

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైన సోమవారం సరుగుడు కర్రలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా సోమవారం బోల్తా పడింది. ఆ సమయంలో పక్కనుంచి ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా లారీ బోల్తా పడడంతో పెద్ద శబ్దం రావటంతో ఫ్లైఓవర్ కూలిపోతుందని దాని కింద ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. అయితే ఈ వాహనం రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ ఎస్.కె.మహ్మద్‌అలీ సంఘటన స్థలానికి చేరుకుని అన్ని వాహనాలను పక్కన ఉన్న సర్వీసు రోడ్డుగుండా మళ్లించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

దగ్ధమైన జీడి తోట

అగ్ని ప్రమాదంలో జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అమలపాడు సముద్ర తీర ప్రాంతంలోని సిఆర్‌జెడ్ పరిధి రైతుల స్వాధీనంలో ఉన్న జీడి తోటలు సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు 10 ఎకరాల్లో జీడి తోట దగ్ధమవ్వగా, మంట వేడి, పొగ కారణంగా సుమారు 50 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. పూత దశలో ప్రమాదం కావడంతో పంటను కోల్పోయామని వాపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం దట్టంగా పొగలు వస్తుండటంతో ఇది గమనించిన నౌగం నారాయణ గ్రామానికి సమాచారం అందించారు. రైతులు హుటాహుటిన తోటలోకి చేరుకున్నారు. మంటలు వ్యాపించడంతో ఆర్పడానికి అవకాశం లేకుండా పోయింది. అగ్నిమాపక శకటానికి సమాచారం ఇచ్చినా తోటలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం లేదు. మాజీ జెడ్‌పిటిసి దున్న వీరాస్వామి తోటలో బోరు నుంచి పైపుల ద్వారానీరు మళ్లించి, మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో దున్న చిరంజీవులు, డికె అప్పన్న, డికె ఢిల్లీరావు, టి.గోవిందరావు, లక్ష్మణరావు, జగన్నాథరావు, తదితర 16 మంది రైతుల తోటలో కాలిపోయాయి. సుమారు 20 లక్షలు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ఉద్యానవన సహాయకులు ప్రశాంత్, విఆర్ఒ కూర్మారావు, సర్పంచ్ దున్న రత్నం బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జీడి పూత, పిక్క దిగుతున్న సమయంలో ప్రమాదం జరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పరామర్శిస్తున్న తులసీవరప్రసాదరావు

పశువుల శాల దగ్ధం

కొత్తూరు: స్థానిక కుమ్మరి వీధిలోని సారిపల్లి కృష్ణవేణికి చెందిన పశువుల శాల సోమవారం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి జి.రమణమూర్తి తన సిబ్బందితో శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. పగటిపూట కాలిపోవడంతో పశువులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. కానీ, నూతన ఇల్లు నిర్మాణానికి ఉపయోగించనున్న కలప పశువుల శాలలో ఉండడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ప్రమాద బాధితులను పరామర్శించారు. ఈయన వెంట సర్పంచ్‌లు అగతముడి రంజిత్ కుమార్, పుచ్చ అప్పారావు, అంపిలి ప్రశాంత్‌కుమార్, అగతముడి నాగేశ్వరరావు, ఆర్.కన్నయ్య, మన్మోహన్, కలమట తిరుపతిరావు ఉన్నారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

టెక్కలి రూరల్ : మండలంలోని శ్యామసుందరపురం సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, ఆటో డ్రైవరు, మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

మాజీ మంత్రి జవహర్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి బయటపడాలంటే తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్ పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అడిగి రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారని ఆరోపించారు. తిరిగి కుర్చీని వదలడం ఇష్టం లేక అరాచకాలను సృష్టిస్తూ తిరిగి గెలవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగేళ్ల పాలనలో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని, ఇసుక, భూములు, మద్యం

మాట్లాడుతున్న మాజీ మంత్రి జవహర్

ఇలా చెప్పుకుంటూ పోతే అన్నింటా అక్రమాలతో అడ్డదారిలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో సానుభూతి కోసం సొంత చిన్నాన్ననే హత్య చేసిన చరిత్ర వైసిపి ఉందన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని రూ.లక్ష కోట్లు సంపాదించిన జగన్‌కు అధికారం కట్టబెట్టడం వల్ల అవినీతికి లైసెన్సు ఇచ్చినట్టయిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ జామి భీమశంకర్, సింతు సుధాకర్ పాల్గొన్నారు.

రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సీనియర్ సిటిజన్లకు కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయాణాల్లో రాయితీని పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య రక్షణలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. వారి శ్రేయసుకు రూపొందించిన చట్టం-2007 ఎమెండుమెంట్ బిల్ పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉందని, తప్పక ఆమోదం పొందేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. ఆయనను కలిసి వారిలో అసోసియేషన్ అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు, శ్రీకాకుళం సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, సంఘం జనరల్ సెక్రటరీ పి.నరసింహమూర్తి, సహ అధ్యక్షులు కె.సోమసుందరరావు, కోశాధికారి పి.ఎస్.ప్రసాదరావు, కె.సవరయ్య, బి.మోహనరావు, బి.పోలయ్య, బి.చిన్మయరావు, బి.జానకిరాం, నవజీవనరావు ఉన్నారు.

11, 12 తరగతులకు సిబిఎస్ఇ సిలబస్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ తేజ

రణస్థలం రూరల్: ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించిన కొద్ది సమయంలోనే దక్షిణ భారతదేశంలోనే సిబిఎస్ఇ 11, 12 తరగతుల అనుమతి పొందిన మొట్టమొదటి స్కూల్‌గా ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు తెచ్చుకుందని డైరెక్టర్ నడుకుదిటి తేజ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం నుంచే అంతర్జాతీయ స్థాయి విద్యావిధానంతో ఈ స్కూల్ విద్యార్థులు ప్రపంచం ఉన్నత శ్రేణి విద్యార్థులతో పోటీ పడతారని అన్నారు. ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ సంవత్సరం సిబిఎస్‌సి దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఆర్యభట్ట మేథ్స్ టెస్టులో దక్షిణ భారత దేశంలో మొదటి వంద మంది విద్యార్థుల్లో ఎన్ఇఆర్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఉండటం

మాట్లాడుతున్న ఈశ్వరరావు, తేజ

గర్వకారణంగా భావిస్తున్నామని అన్నారు. ఇది మన ఎన్ఇఆర్ స్కూల్‌లో పనిచేస్తున్న అధ్యాపకుల నైపుణ్యం వల్లే సాధ్యమైందన్నారు. ఇంటరనేషనల్ విద్యను అన్ని తరగతుల వారికి అందుబాటులో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి స్థాపించిన కొద్ది రోజుల్లోనే జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది ఎంపిసి, బైపిసి, ఎఇసి, ఎంబైపిసి, ఎంఇసి తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, స్కూల్ ప్రెసిడెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన ఆనంగి ఈశ్వరి ఇటీవల రాజపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె ఇళ్లకు పేయింటింగ్ వేస్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె మృతితో కుటంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. విషయం తెలుసుకున్న గ్రామ యువత రూ.10,100 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వాసు, రామకృష్ణ, నారాయణ, ధర్మాపుర యువత పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందిస్తున్న యువత

కిడ్నీ రోగికి...

వజ్రపుకొత్తూరు: కిడ్నీ రోగికి యువతరం సేవా సమితి ఆదివారం తన వంతు ఆర్థిక సాయం అందజేసింది. సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన కంబల ముకుంద రెండు కిడ్నీలు పని చేయడం లేదు. కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆర్థిక సహకారం కోసం యువతరం సేవా సమితిని సంప్రదించారు. సభ్యులు అందరూ కలిసి సోమవారం చెక్ రూపంలో రూ.15,000 బాధితుని ఇంటికి వెళ్లి అందజేశారు. సంస్థ అధ్యక్షులు చింత మురళి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న బాధితులకు తమ సంస్థ తరపున ఎప్పుడు సహాయం అందిస్తుంటామని అన్నారు. కార్యక్రమంలో గోరకల అశోక్, కె.వల్లభరావు, గోరకల విఘ్నేష్, కె.సోమేశ్వరరావు, జ్యోతి, పాలిన నూకరాజు, కె.కుసరాజు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ స్టడీ మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పూర్ణ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని తలతంపర పంచాయతీ కాలింగపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నవోదయ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జై భీమ్ సేన జిల్లా కార్యదర్శి మర్రిపాటి పూర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ జై భీమ్ సేన ద్వారా నిరుపేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామన్నారు. విద్యాభివృద్ధికి తమ సహకారం ఎల్లవేళలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శరత్‌చంద్ర పాణిగ్రాహి, ఉపాధ్యాయులు ధర్మరాజు, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

ఘనంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి- పోలాకి

ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి నాయకులు కె.కృష్ణారావు, ఆర్.త్రినాథరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బి.జగన్నాథం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నీలం, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

జి.సిగడాం : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని సమర్థంగా నిర్వహించాలని ఎంఇఒ అరసాడ రవి వంట కార్మికులకు సూచించారు. జి.సిగడాం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని సోమవారం పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీర రాము, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్ భవ్యశ్రీ పాల్గొన్నారు.

ఐతమ్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఈసిఈ, ఎంబిఎ బ్రాంచ్‌లకు చెందిన 256 మంది రెండో ఏడాది విద్యార్థులకు ఐతమ్, సిఎంస్ ఎక్సలెంట్‌లో ఎపిఎస్ఎస్‌ఎసి ద్వారా సోమవారం నుంచి వారం రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వర రావు తెలిపారు. ఈసిఈకి 'అమజాన్ వెబ్ సర్వీస్' అనే అంశంలో భాగంగా సర్వర్లు లాంచింగ్ యూజింగ్ ఈసి2, విపిసి, లోడ్ బేలన్సర్, వెబ్సైట్ హోస్టింగ్ యూజింగ్ విన్ స్కాప్, సింపుల్ స్టోరేజ్ సర్వీస్, క్లౌడ్ వాచ్‌లపై ఎంబిఎకు 'డేటా ఎనాలసిస్ యూజింగ్ పైతాన్'లో భాగంగా ఎంబిఎ విద్యార్థులకు డేటా విజులైజేషన్, ఎక్స్‌ప్లోరేటరీ డేటా ఎనాలసిస్, మిషన్ లెర్నింగ్,

శిక్షకులతో నాగేశ్వరరావు

డేటా ఎనాలసిస్, మిషన్ లెర్నింగ్, డేటా ఎనాలసిస్ విత్ పాండ్స్, డేటా మేనిపులేషన్ విత్ నుంఫీ వంటి వాటిపై టి.శ్రీకణ్య, అనిల్‌కుమార్ శిక్షణ ఇవ్వనున్నట్టు డైరెక్టర్ వివరించారు. ఈ తరగతులను ప్రిన్సి పాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, వి.అశోక్ కుమార్, డాక్టర్ బి.రామారావు, ఇ.జయ, శివకుమార్, గోపాలకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

రేపు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న కిమ్స్ ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి 2 గంటల వరకు వైద్యులు స్వర్ణలత, లాస్య వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డాక్టరు సలహా మేరకు గర్భిణులకు చేసే వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిందితులను అరెస్టు చేయాలి

పర్లాకిమిడి : పర్లాకిమిడి నవోదయ పాఠశాలలో చదువుతున్న బాలికను హత్య చేసిన నిందితులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాని రైతో డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. హత్య జరిగి 15 రోజులు అవుతున్నా ఇంతవరకు పోలీసులు నిందితులను గుర్తించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మోహితో మిషాల, కొండింగి మిన్నారావు, రాయగడ జిల్లా

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ఆదివాసీ నాయకులు జేమ్స్ సబర్, గుమ్మా బ్లాక్ ఆదివాసీ నాయకులు ప్రకాష్ రైతో, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుకూసబర్, డివైఎఫ్ఐ కాశీనగర్ బ్లాక్ కార్యదర్శి నాగేశ్వర్‌సబర్, ప్రజా సంఘాల నాయకులు రంజాన్ మహాపాత్రో, నరసింఘమాల బిసాయి, గోకులదల బెహరా, సమ్మెంద్ర సబర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

జలుమూరు : టీకాలు వేస్తున్న జయరాజ్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని నిమ్మాడ పశువైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేష్ అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని హరిశ్చంద్రపురం, చిన్నహరిశ్చంద్రపురం గ్రామాల్లో 186 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు సోమవారం వేశారు. ఈ వ్యాధి సోకిన పశువులకు 104-106 డిగ్రీలు జ్వరం వస్తుందని అన్నారు. నోటి నుంచి తీగల మాదిరి చొంగ కారడం, నోటిలో, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం, తిండి మందగించి నీరసించడం, చిన్న ఎండకు రొప్పడం, చుడి పశువులు ఈసుకుపోవటం, ఎడ్లలో పని సామర్ధ్యం తగ్గుతుందని అన్నారు. ఈ వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోతాయని అన్నారు. అందుకు పశువులకు టీకాలు వేయించుకుని పశువుల ఆరోగ్య పరిరక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ కె.లక్ష్మి, నరసమ్మ, పశు వైద్య సహాయకులు ఎం.బలరాం, గోపాలమిత్ర కనకరాజు, సంతోష్ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు గాలికుంటు నివారణ టీకాలు

జలుమూరు: జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా మార్చి ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ టెక్కలి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్కలి డివిజన్ పరిధిలో 261 మంది సిబ్బందితో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. డివిజన్‌లోని 16 మండలాల్లో 2.26 లక్షల నలుపు, తెలుపు పశువులు ఉన్నాయన్నారు. జలుమూరు పశువైద్య కేంద్రం పరిధిలో ఎనిమిది మంది సిబ్బందితో 5,150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టెక్కలి ఏడిఎం లోకనాథం, జలుమూరు పశువైద్యాధికారి ఎం.దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'హాథ్ సే హాథ్'పై సమీక్ష

శ్రీకాకుళం అర్బన్ : 'చేయి చేయి కలుపుదాం.. కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం' అంటూ చేపట్టిన హాథ్ సే హాథ్ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కో-ఆర్డినేటర్లు డోల శ్రీను, భగత్‌లు పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవనంలో డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అధ్యక్షతన కార్యకర్తలతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ సిద్ధాంతాలు తెలియజేయా లన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవిందమల్లిబాబు, కోత మధుసూదనరావు, పేడాడ పరమేశ్వరరావు, పప్పల వెంకటరమణ, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న డాక్టర్ అనూరాధ

పౌష్టికాహార కిట్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఎఆర్‌టి చికిత్స పొందుతున్న హెచ్ఐవి బాధితులకు బలమైన పోష్టకాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనూరాధ అన్నారు. నగరంలోని జిజిహెచ్‌లో ఉన్న ఎఆర్‌టి సెంటర్‌లో సాతీ స్వచ్ఛంద సంస్థ, మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యాన 15 మంది హెచ్ఐవి రోగులకు సోమవారం పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఎఆర్‌టి వైద్యాధికారి డాక్టర్ బి.అప్పలనాయుడు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, సాతీ స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు డి.వి.సత్యనారాయణ, చంద్రశేఖర పాల్గొన్నారు.

విరాళం అందజేత

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు ఎ1 ఆస్పత్రి వైద్యులు ఎ.ప్రమీల రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు సోమవారం చెక్కును అందజేశారు. ఈ నిధులతో టిబి బాధిత కుటుంబ సభ్యులకు పౌష్టికాహార సామగ్రి కిట్లు, బ్రెడ్, పప్పు దినుసులు, నూనె, పాలపొడి ఇతర సామగ్రి అంద జేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ, పెద్దపేట ఆర్ట్స్ సంస్థ అధ్యక్షులు నూక సన్యాసిరావు, రాధాకృష్ణ, సూరంగి మోహనరావు, నటుకుల మోహన్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న డాక్టర్ ప్రమీల

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు మెప్మా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ వైద్య ఆరోగ్య శాఖల పరిధిలో వర్కింగ్ ఉమెన్స్‌గా సేవలందిస్తున్న వారికి చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవ సదన్‌లో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయ అవగాహనా సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ అనూరాధ, సీనియర్ న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, మెట్ట సత్యనారాయణ, ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

గుట్కా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - సోంపేట

విద్యాలయాల సమీపంలో గుట్కా, సిగరెట్, మద్యంతో పాటు, ఇతర మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సోంపేట సిఐ అర్.రవిప్రసాద్ దుకానదారులకు హెచ్చరించారు. సోమవారం ఎస్ఐ ఎస్.బాలరాజు, పోలీస్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న దుకాణ దారులను హెచ్చరిస్తూ అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, ముఖ్యంగా విద్యార్థులకు సిగరెట్లు, గుట్కాలు, మద్యం వంటివి విక్రయించవద్దని హితవుపలికారు. పట్టణంలో ఉన్న 1, 2 సచివాలయాలను పరిశీలించి అక్కడ ఉన్న లబ్దిదారులతో మాట్లాడారు. సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

దుకాణ యజమానులకు అవగాహన కల్పిస్తున్న సిఐ

రేపు మహిళా సదస్సు

శ్రీకాకుళం అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం సాయంత్రం 3 గంటలకు నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు చింతాడ మంజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలోని మహిళా నాయకులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథిగా వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొంటారని తెలిపారు.

నేడు నాయకులతో సమావేశం

బూర్జ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో మంగళ వారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అల్లెన ఎంపిటిసి వావిలపల్లి సీతారాం వరప్రసాదమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానానికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించామ న్నారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఆఫీసు ప్రారంభం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పట్టణంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయాన్ని జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు డిఎస్‌విఎస్.కుమార్ సోమ వారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా క్రిస్టియన్ అభివృద్ధి, సంక్షేమం కోసం సెల్ కృషి చేస్తోందన్నారు. అనంతరం జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి అన్వేష్‌కు మండలాల వారీగా పాస్టర్లు సన్మానం చేశారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఎదురుగా కెనరా బ్యాంకు మేడపై కార్యాలయం అందరికీ అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా బాపిస్ట్ చర్చి అధ్యక్షులు పత్తి విజయకుమార్, వజ్రపు వెంకటేష్, ఫాస్టర్లు ప్రవీణ్, డి.ఏలీయా, సుందర రాజ్, ఇతర మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమార్

పైపులైను పనులు పరిశీలిస్తున్న రమేష్‌నాయుడు

నీటి ఎద్దడి నివారణకు కృషి

ప్రజాశక్తి - పలాస

నీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నామని పలాస ఎంపిడిఒ రమేష్‌నాయుడు అన్నారు. సోమవారం లొద్దభద్ర లో మంచినీటి పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు మంచినీటి ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయనతో పాటు కార్యదర్శి సద్గుణబాబు, జి.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం

వజ్రపుకొత్తూరు: ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత అవసరమనిరాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం గోవిందపురం పంచాయతీ మెట్టుపేటలో వైస్ సర్పంచ్ గుంట సత్యనారాయణ ఆధ్వర్యాన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ నిర్వహించారు. మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ పాలిన రమ్య, వైస్ సర్పంచ్ జి.సత్యనారాయణ, నాయకులు పాలిన ఉమామహేశ్వరరావు, డి.మోహన్‌రావు, కె.భగవాన్, ఎం.వెంకటరావు, కె.శ్రీనివాసరావు, కె.భాస్కర రావు, ఎ.శ్రీను, వరదరాజులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు శ్రీకారం

టెక్కలి: విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యా బోధనలో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టనున్నామని విశ్వజ్యోతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దువ్వల రవికుమార్ అన్నారు. కళాశాల విద్యార్థుల వీడ్కోలు సభ సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మెండ మోహనరావు మాట్లాడుతూ ఆదర్శప్రాయమైన బోధనలతో సైద్ధాంతిక పరమైన ఆలోచనలతో కళాశాల ఏర్పాటు చేయడమైందని తెలిపారు. ఈ సందర్భంగా ఏడాది పలితాలను వివరించారు. విద్యార్థులు వివిధ పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు జి.రవికుమార్, బి.నగేష్, ఎన్.రమేష్, డి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివరావు ఎన్నికపై హర్షం

ఇచ్ఛాపురం: ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షులుగా యలమంచిలి సదాశివరావు, విశాఖ సిటీ వైడ్ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షునిగా వానపల్లి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఇచ్ఛాపురం నియోజకవర్గ మెగాస్టార్ అభిమాన సంఘం అధ్యక్షులు ప్రసాద్, ఆలీమ్‌ఖాన్, అజయ్, హర్షం వ్యక్తం చేశారు. విశాఖలోని శ్రీకాంతి థియేటర్ ఆవరణలో ఉత్తరాంధ్ర మెగా అభిమానుల ఆధ్వర్యాన జరిగిన సమావేశంలోవీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెలలో మెగా పవర్ స్టార్ రామ్‌చరణ పుట్టిన రోజు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పలాస: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ముందుస్తుగా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలాస సివిల్ జడ్జి రవిశంకర్ పాల్గొని మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాండ్ర మురళి, న్యాయవాదులు అనిల్‌రాజు, పిండి వెంకటరావు, సిఐ శ్రీనివాసరావు, ఆర్‌టిసి డిపో మేనేజర్, నాగప్రసాద్, దేవరాజ్, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం చేస్తున్న రవిశంకర్